# ఓ లాల

ఎమ్. హరా

**ఆ రోజు** సాయంకాలం బి.పి. పెరిగేలా పోట్లాడుకున్నారు ఆదిమూర్తి, ఆదెమ్మ. 'వెధవ కొంప... వెధవ కొంప. క్షణం సేపు సైలెంట్‌గా ఏడవదు కదా' అని చీదరించుకుంటూ. అయిదు వరదలు కట్న మిచ్చి తనని కొనుక్కున్న భార్యపై చేయి చేసుకోలేక. బానిసలా ఆ ఇంటినుంచి బయట పడ్డాడు ఆదిమూర్తి. తగవులాట మధ్యలో ఆయన నిష్క్రమణకి ఒళ్ళు మండినా, తాళి కట్టిన వాడి చొక్కా పట్టుకుని వెనక్కి గుంజలేక, ఉక్రోషపడి, అలా అని చేతులు ముడుచుకుని కూర్చోలేక ఇంటికి తాళం వేసి, గుడిలో పురాణం విందామని కాళ్ళకి బుద్ధి చెప్పింది ఆదెమ్మ.

ఉత్తర, దక్షిణ ధ్రువాల్లాంటి ఆదిమూర్తి, ఆదెమ్మ గత మూడు పుష్కరాలుగా కాపరం చేస్తున్నారు. అయస్కాంతం, ఐరన్ ముక్కల్లా ప్రతి క్షణం కలిసి ఉండకపోయినా, వాళ్ళకి సంతానం అయిదుగురు పిల్లలు.


గుడిలో అవధానిగారు చెప్పేది అర్థంగాక తెగ ఇబ్బందిపడుతూ కుదురుగా కూర్చోలేక పోతున్నది ఆదెమ్మ. అలా అని పక్కనున్న వారిని మోచేత్తో పొడుస్తూ అవధానిగారు ఏం చెబుతున్నారని ఆవిడ ఆరాలు తీయడం లేదు. చెప్పేవారికి అర్థమై, వినేవారికి అర్థం కానిది పురాణం. ఇటు చెప్పేవారికీ, అటు వినేవారికి అర్థం కానిది వేదాంతం. అందువల్ల అవధానిగారు వేదాంతం చెబుతున్నారని తీర్మానించుకుని గుట్టుచప్పుడు కాకుండా వినసాగింది ఆదెమ్మ.

అంతలో "ఆదెమ్మగారు వెంటనే నవగ్రహ మండపం దగ్గరికి రావాలి. వారిని అర్జంట్‌గా కలవాలని ఎవరో వచ్చారు" అంటూ లౌడ్ స్పీకర్‌లో వినిపించింది.

ఆ కేకలు తన కోసమని తు. చ. తప్పకుండా అర్థమైనాయి ఆదెమ్మకు. ఆవిడ గబాల్న లేవబోయింది. కాని, లేవలేకపోయింది. కారణం- అయిదు దశాబ్దాల వయసు దాటిన ఆవిడ కాయం బహు భారీగా ఉంది. ఆపసోపాలు పడుతూ నెమ్మదిగా లేచి, జనాన్ని తప్పించుకుంటూ నవగ్రహ మండపాన్ని సమీపిస్తూ 'ఎవ రా దశమగ్రహం' అని సణిగింది.

"నేనే, అక్కయ్యా... లోకనాథాన్ని" అంటూ ఓ నడివయసు వ్యక్తి లెదర్ సూట్‌కేసు చేతులు మార్చుకుంటూ ఆవిడ దగ్గరికి వచ్చాడు.

"ఓరి! నువ్వట్రా, లోకం. ఇలా తగలడ్డావేం?"



"కోర్టు పనిమీద వచ్చాను. ఎలాగూ ఈ ఊరు వచ్చాను గదా అని నిన్నొకసారి చూసిపోదామని ఇంటి కెళ్ళాను. వీధి తాళం మౌనగీతం ఆలపించింది. మీ నైబర్ నీ కాంపు ఎడ్రెస్ గానం చేసింది. ఇలా చక్కా వచ్చేశాను. నువ్వు బాగా మారావు, అక్కయ్యా. పూర్వపు ఉత్సాహం, ఉద్రేకం లేవు" అంటూ పళ్ళికిలించాడు లోకనాథం.

అతను ఆవిడకి దూరపు బంధువు. వరసకి తమ్ము డవుతాడు. బహు లౌక్యుడు.

"నేను బాగానే ఉన్నాను కానీ, పద ఇంటికి వెళ్దాం" అంటూ ఆదెమ్మ దారి తీసింది.

"నువ్వెంత దాచినా నీ గుండెలో మంట నిన్నేగాక నన్నుకూడా దహించి వేస్తోందక్కయ్యా. బావగారితో నువ్వెంత విసిగిపోకపోతే, నువ్విలా మలయాళ పురాణం వింటావు" అన్నాడు అతను కృత్రిమ సానుభూతి చూపిస్తూ.

'నే నింతవరకు విన్నది తెలుగు వేదాంతం కాదా? మలయాళ పురాణమా? అందుకే ఒక్క ముక్కకూడా అర్థమై చావలేదు' అంటూ ఆశ్చర్యంగా వినుకుంటూ ఇంటి తాళం తీసింది ఆదెమ్మ.


అవధానిగారు ఆరున్నొక్క భాషల్లో అవలీలగా పురాణం చెప్పగలరు. రోజు రోజుకి హారతి పళ్ళెంలో చిల్లర చిక్కిపోవడంతో ఆయనకి ఒళ్ళు మండి ఆ రోజు మలయాళ పురాణం చెప్పారు. పిచ్చాపాటీ కబుర్లు చెప్పుకుంటూ, మధ్య మధ్యలో తలలు ఊపుతూ కిమ్మనకుండా మలయాళ పురాణం విన్నారు భక్తులు. ఇంట్లో ఉబుసుపోక, ఏదో కాలక్షేపానికి వచ్చిన వారికి పురాణమైనా, వేదాంతమైనా ఒకటే. భాష మారినా ఫరవాలేదు.

"ఒపిగ్గా వెర్రి ముఖం వేసుకుని మలయాళ పురాణం వినే కర్మ నీ కెలా పట్టిందే? మీ పిల్లలంతా పెద్దవాళ్ళైనారు. నలుగురు పిల్లల ఉద్యోగ, వివాహ కార్యక్రమాల్ని మీరు విజయవంతంగా నిర్వహించారు. వాళ్ళు మీపై ఆధారపడకుండా, వాళ్ళ అప్పు లేవో వాళ్ళే చేసుకుంటూ హాయిగా బతికేస్తున్నారు. ఇక మీ చివరి నలుసు సాంబుకి ఉద్యోగం దొరికింది. ఇంకా తీరిగ్గా కీచులాడుకోవడానికి మీ కే సమస్య లున్నాయి" అన్నాడు లోకనాథం కుర్చీలో కూర్చుంటూ.

"సాంబు పెళ్ళి గురించే నేనూ, మీ బావా రోజూ పేచీలు పడుతున్నాము. ఈ రోజు పినరంత తారస్థాయికి చేరింది. ఆయన రోడ్డెక్కారు. నేను గుడికి చేరాను" అంటూ ముక్కు చీదింది.

సాంబుని తన అక్కయ్య కూతురు గౌరికి ఇస్తానంటాడు ఆదిమూర్తి. 'కాదు, కూడదు. తన అన్నయ్య కూతురు గంగకి ఇవ్వా'లంటుంది ఆదెమ్మ. ఉద్యోగరీత్యా హైదరాబాదులో ఉన్న సాంబుకి చేరువలోనే ఉన్నారు గంగ, గౌరి.

"భారీ కట్నం తెచ్చిన పెద్ద కోడలు నన్ను చీపురుపుల్లలా చూస్తుంది. మీ బావగారికి దూరపు చుట్టమైన రెండో కోడలు నన్ను లెక్క చేయదు. ఇక మూడో కోడలు ఉద్యోగం వెలగబెడుతున్నది. నీకు తెలియని దేముంది? మా అల్లుడి కథ దినపత్రిక వార్త. చివరివాడైన సాంబుకి అయిన సంబంధం చేస్తే నేను సుఖపడతానని మీ బావని పోరుతున్నాను. మా ఆరోగ్యాలు రోజు రోజుకి క్షీణిస్తున్నాయి. రాయివేటు దూరంలో పిల్లలు లేరు. గంగైతే సాంబుని కూడా విడిచి మకు



సేవలు చేయడానికి ఇక్కడే ఉంటుంది. నే నంటే దానికి వల్లమాలిన ప్రేమా అభిమానం గట్రా ఉన్నాయి. ఎంతైనా మా అన్నయ్య కూతురు. మేనత్త పోలికలు తూచినట్లు వచ్చాయి. సాంబుని గంగకిస్తానంటే మీ బావ తాగిన కోతిలా గెంతులు వేస్తారు" అంటూ తన బాధా. కష్టం చెప్పసాగింది ఆదెమ్మ.

"గంగంటే సాంబుకి వెర్రి ప్రేమ" అంటూ ఆమెకి వత్తాసు పలికాడు లోకనాథం.

"నిజంగానా?"

"నిజం, అక్కయ్యా. నా కేసుమీద ఒట్టు. వారం రోజుల క్రితం హైకోర్టు పనిమీద హైదరాబాద్ వెళ్ళాను. పనిలో పనిగా సాంబు రూమ్‌కి వెళ్ళాను. గదిలోకి వెళ్ళి చూద్దును గదా. ఏమని చెప్పను? మీ వాడూ, గంగా ఒకే కుర్చీలో కూర్చుని ఊసులాడుకుంటున్నారు. వాళ్ళు అతి దారుణంగా ప్రేమించుకుంటున్నారు."

కోర్టు పనిమీద ఆ ఊరు వచ్చిన లోకనాథం పైసా ఖర్చు లేకుండా ఆ ఇంట్లో లాడ్జింగ్, బోర్డింగ్ ఏర్పాటు చేసుకోవడానికి, ఆవిడని ఆకట్టుకోవడానికి పకడ్బందీగా ఓ కట్టుకథ అల్లాడు.

"నీకు పుణ్యం ఉంటుంది. ఈ మాటని మీ బావ చెవిన వేయరా" అం దావిడ అవధులు దాటిన ఆనందంతో.

"ఇక వస్తాను, అక్కయ్యా. మాజీ చైర్మన్‌గారిని కలవాలి. ఉడిపి హోటల్లో ఉభయం చెప్పుకోవాలి" అంటూ సూట్‌కేస్ సమేతంగా లేచాడు లోకనాథం.

"నేను చచ్చాననుకున్నావా? నీ పనులు అయ్యేంతవరకు మా ఇంట్లోనే ఉండు. వేరే బస చూసుకుంటే నేను ఊరుకోను. ముందా సూట్‌కేస్ ఇలా ఇవ్వు."

×× ×× ××

అన్నదాన సమాజం వారు ఏర్పాటుచేసిన కవి సమ్మేళనం చూడడానికి, వినడానికి మీటింగ్ హాల్లోకి వచ్చాడు ఆదిమూర్తి. ఆ హాల్లో పట్టుమని పాతిక మంది ప్రేక్షకులు లేరు. స్టేజీపై వేసి ఉన్న కుర్చీలు బోసిగా ఉన్నాయి. ఆదిమూర్తి ప్రేక్షకుల్లో చతికిల బడి గతాన్ని నెమరు వేసుకోసాగాడు.

మునిసిపల్ హైస్కూల్లో హెడ్మాస్టర్ గిరీ వెలిగించి రిటైరైనాడు ఆదిమూర్తి. తన కనుసన్నలతో పన్నెండు వందల విద్యార్థుల్ని, అరవైమంది ఉపాధ్యాయుల్ని అదుపులో పెట్టగలిగే వాడే కాని, కట్టుకున్న భార్యని నయానా, భయానా మచ్చిక చేసుకోలేకపోయాడు. ఆదెమ్మ గయ్యాళి. అందువల్లనే ముగ్గురు కొడుకులు ఆంధ్రదేశపు మూడు మూలల్లో తల దాచుకుంటున్నారు. ఇక అల్లుడు... 'వేలకి వేలు తగలేసి నిన్ను కొన్నాం. మీ వాళ్ళకి మా అమ్మాయి సేవ చేయలేదు. వేరింటి కాపరం పెట్ట'మని అల్లుడిపై దండయాత్ర చేసింది ఆదెమ్మ. 'మది ఉమ్మడి కుటుంబం. నేను వేరే కుంపటి పెట్టలేను. మీ కంత కష్టంగా ఉంటే మీ అమ్మాయిని మీ ఇంట్లో ఉంచుకోం'డని తెగేసి చెప్పాడు అల్లుడు. ఆ అమ్మాయి తల్లి మాట కాదని మొగుడు పంచలోకే చేరింది. శుభం.

అవసరానికి మించిన మొగ్గుతో మేనత్త పోలికలు తూచినట్లు వచ్చిన గంగకి సాంబుని కట్టబెట్టడానికి ససేమిరా అంగీకరించలేదు ఆదిమూర్తి. భార్యతో రోజూ వాదనకి దిగుతున్నాడు. తన కొడుకు జీవితం తన బ్రతుకులా ఇలా మీటింగ్ హాల్స్‌లో తెల్లారకూడదని వేయి దేవుళ్ళకి మొక్కుకుంటున్నాడు ఆదిమూర్తి.

ఆ సభకి అధ్యక్షత వహించవలసిన మాజీ చైర్మన్‌గారు హడావిడిగా స్టేజీ మీదికి రాగానే గతంలోంచి వర్తమానంలోకి వచ్చాడు ఆదిమూర్తి.

ఆహ్వాన సంఘాధ్యక్షుడు గొంతు సవరించుకుని కవి సమ్మేళనంలో పాల్గొనే కవులని వేదిక మీదికి ఆహ్వానిస్తున్నాడు. ప్రేక్షకుల్లోంచి ఒక్కరొక్కరే స్టేజీ మీదికి రాసాగారు. చిట్టచివరికి ఆదిమూర్తి ఏకైక ప్రేక్షకుడిగా మిగిలాడు. పాతిక కవితలు తానొక్కడే వినాలని తల్లడిల్లలేదు కాని, భార్య పోరుకన్నా ఇదే నయమని తనని తాను సముదాయించుకున్నాడు ఆదిమూర్తి.

"సభకి నమస్కారం. నాకీ రోజు చాలా ఆనందంగా ఉంది. నేను గోచీలు పెట్టే రోజుల్లో ఒక కవి పద్యాలు చదివితే వందమంది వినేవారు. నేడు వంద మంది చదువుతూంటే ఒక్కడు వింటున్నాడు. నా ఒళ్ళు పులకరిస్తున్నది. మన దేశం ఎంత అభివృద్ధి సాధించిందో చెప్పడానికి మచ్చుకీ సంఘటన చాలు. ఇక పోతే..." అంటూ లాల్చీ జేబులోంచి ఒక కాగితం తీసి గడగడా చదవసాగారు మాజీ చైర్మన్.

"బలహీన వర్గాలకి, ముఖ్యంగా బడుగు ప్రజలకి, ఇంకా చెప్పాలంటే మురికివాడ ప్రజలకి, గట్టిగా చెప్పాలంటే సంఘ బహిష్కృతులకి ఇప్పటివరకు పన్నెండు లక్షల..."

అంతలో "సార్, మీకు ఫోన్ కాల్" అని ఓ కార్యకర్త ఆయన చెవిలో ఊదాడు.

"మీ కార్యక్రమం కానీయండి" అంటూ ఆయన లోపలి గదిలోకి వెళ్ళి రిసీవర్ అందుకున్నాడు.

"నమస్తే, సార్. నేను పి.ఎ. ని మాట్లాడుతున్నాను. మీకు పార్టీ టికెట్ వచ్చే అవకాశం లేదని ఇప్పుడే తెలిసింది. పరాయి పార్టీతో బేరం చేస్తున్నాను. మీరు వెంటనే రండి. మన మిర్చి గోడౌన్‌లో రహస్య సమావేశం ఏర్పాటు చేశాను. ఇక పోతే, కవుల మీటింగ్ రసాభాస కాకుండా నేను మీ డూప్‌ని పంపిస్తున్నాను. వాడు వచ్చేలోగా ఏదో కారణం చెప్పి దొడ్డి దోవన రండి" అంటూ అవతల వైపునుంచి ఫైరింజన్ గంటలా గణ గణ మ్రోగింది కంఠం.

అదే సమయంలో మాజీ చైర్మన్ గారిని కలవడానికి మీటింగ్‌కి వచ్చాడు లోకనాథం. ఆయన లోపల గదిలో ఉన్నారని తెలుసుకుని కాసేపు నిరీక్షిద్దామనుకున్నాడు. కవితా ఘోష వినలేక బోసిగా ఉన్న హాలు నంతా కలియజూస్తూ ఉలిక్కిపడ్డాడు. అతని కడుపులో ఎవరో దేవినట్లయింది. వందలాది ఖాళీ కుర్చీలున్న ఆ హాల్‌లో ఒకే ఒక కుర్చీలో నిర్జీవంగా పడి ఉన్న ఆదిమూర్తిని చూడగానే అతనికి బోలెడంత జాలి వేసింది. గబగబా ఆయన దగ్గరికి వెళ్ళి "బావా! నీ కెంత కష్టం వచ్చింది" అంటూ వాపోతూనే ఆయన జేబులో యాభై రూపాయల నోటు ఉందని పసిగట్టాడు లోకనాథం.

"నా కష్టాన్ని పంచుకోవడానికి తోడుగా వచ్చావుగా."

నిర్జీవ మందహాసం చేశాడు ఆదిమూర్తి.

"ఇక్కడే కాదు, మీ ఇంట్లోకూడా కష్టాన్ని పంచుకోవడానికి రెడీగా ఉన్నాను. నువ్వెంత అయోగ్యుడివి, బావా? అయినా, ఊరికే అన్నారా? గత జన్మ కర్మ కొంత, నేడు చేజేతులా చేసుకునేది మరింతాని."

"ఇంట్లో నా మాట నెగ్గదు. గౌరి పేరెత్తగానే ఇల్లు తీసి పందిరేస్తుంది మీ అక్కయ్య. మీ ఇల్లు షేప్ మారింది. రివైజ్డ్ ప్లాన్ అప్రూవ్ చేయించుకోవాలని నా వెంట పడతారు మునిసిపాలిటీవాళ్ళు. వాళ్ళని మేపలేక చస్తున్నాను."

"రేపటినుంచి మా అక్కయ్య మాట చెల్లదు. గౌరిని పిచ్చిగా ప్రేమిస్తున్నాడు సాంబు. మొన్న హైదరాబాద్ వెళ్ళినప్పుడు వాడి రూమ్‌కి వెళ్ళాను. గౌరి, సాంబు ప్రేమ పాటలు ప్రాక్టీసు చేస్తున్నారు. ఇక సాంబు తల్లి మాట వినడు. గౌరి కొంగు పట్టుకుంటాడు."

"నిజంగానా!"

"ఈ విషయం మా అక్కయ్యకి చెప్పమంటే వెంటనే చెప్పలేను. నేను అర్జంటుగా మాజీ చైర్మన్ గారిని కలవాలి. ఆయ నింటికి వెళ్ళాలంటే ఆటో చార్జీలకి యాభై కావాలి. నా దగ్గర లేవు కాబట్టి, కాలినడకతో నా పని పూర్తి చేసుకుని మీ ఇంటికి చేరేసరికి రెండు రోజులు పడుతుంది." మాటలు నాన్చి మంత్ర జలం చల్లాడు.

"యాభై నేను ఇస్తాను కాని, వెంటనే గౌరి సాంబుల ప్రేమకథ మీ అక్కయ్య చెవిలో ఊదు."



అంటూ డబ్బు ఇచ్చాడు ఆదిమూర్తి.

×× ×× ××

ఉల్లాసంగా ఇంటికి వచ్చాడు ఆదిమూర్తి. గంగా గౌరీ సంవాదం గానం చేస్తూ వంట చేస్తున్నది ఆదెమ్మ.

"ఏమిటే పిండివంటలు చేస్తున్నావు? గంగ పెళ్ళికి ముహూర్తం పెట్టినట్లు మీ అన్నయ్య టెలిగ్రామ్ ఇచ్చాడా?" వెటకారంగా అన్నాడు ఆదిమూర్తి.

"మీకు శుభవార్త తెలిసిందా?" ఆశ్చర్యపోయింది ఆదెమ్మ.

"ఏ శుభవార్త?"

"గంగ, సాంబు వెర్రిగా ప్రేమించుకుంటున్నారని."

"చిన్న సవరణ. గౌరి, సాంబు పిచ్చిగా ప్రేమించుకుంటున్నారు."

"ఎవరలా కూసింది?" గర్జించింది ఆదెమ్మ.

"నేనే, అక్కయ్యా. ఈ రోజు పిండాకూడు కోసం, యాభై రూపాయల భిక్ష కోసం నోటికి వచ్చినట్లు వాగాను. మీ అబ్బాయి చిరంజీవి సాంబశివరావు గంగని, గౌరిని కాదని మోహిని అనే పేదింటి పిల్లను ప్రేమించాడు" అంటూ అప్పుడే వచ్చిన లోకనాథం తన సూట్‌కేసు చంకన పెట్టుకున్నాడు.

"ఎవరా మోహిని?" తుపాకీ పేల్చింది ఆదెమ్మ.

"నేను చెప్పను" అంటూ ఆవిడకి అందకుండా బయటికి జారుకున్నాడు లోకనాథం. తన పబ్బం గడుపుకోవడానికి ఏదో నాటకం ఆడదామనుకున్నాడు. తన పని వాయిదా పడటంతో ఒళ్ళు మండి వాళ్ళిద్దరి మధ్య నిప్పు రాజేసి చల్లగా తప్పుకున్నాడు.

'వెధవ కొంప...వెధవ కొంప' అని గొణుక్కుంటూ మళ్ళీ రోడ్డెక్కాడు ఆదిమూర్తి.

భర్త వంక సాలోచనగా చూడసాగింది ఆదెమ్మ.

×× ×× ××

హైదరాబాద్‌కి టికెట్ తీసుకుని బస్సెక్కింది ఆదెమ్మ. లాస్ట్ బట్ వన్ టూ-సీటర్‌లో ఒకే ఒక ఖాళీ ఉండటం గమనించింది. గబగబా ఆ సీటులో కూర్చోబోయి పక్కకి చూసి దడుచుకుంది. 'ఇక్కడకూడా నువ్వేనా' అంటూ దీర్ఘం తీశాడు ఆదిమూర్తి. 'గుట్టు చప్పుడు కాకుండా మీ మేనకోడల్ని సాంబుకి అంటగట్టాలని బయలుదేరారా' అంటూ కళ్ళతో భర్తని కసిరింది. 'నువ్వు మాత్రం తక్కువ తిన్నావా' అన్నట్లు ఆవిడకి సమాధానం చెప్పాడు ఆదిమూర్తి.

బస్సు బయలుదేరింది. జగ్గయ్యపేటలో ఆగింది. భర్తని అల్లరిపెట్టి బస్సు దించాలనే దురాలోచనతో గడుసుగా గట్టిగానే అంది ఆదెమ్మ:

"ఆడపురుగు కనబడగానే మగవెధవల ఒళ్ళు నిలకడగా ఉండి చావదు. అది ముక్కుపచ్చలారని పసిదా? లేక పండు ముసలిదా అనికూడా చూడరు. ఆడది కనబడగానే దురద పుడుతుంది. ఛీ. ఛీ. ఏళ్ళు రాగానే సరా?"

"బామ్మగారూ. మీ రిలా మా అమ్మ పక్కన కూర్చోండి. నేను మీ సీటులో తాతయ్యగారి పక్కన కూర్చుంటాను" అంటూ బాక్ సీట్‌లో కూర్చున్న ఓ యువతి హెచ్చరించగానే కాలిన శరీరంపై నీళ్ళు చల్లినట్లు గిలగిల్లాడుతూ "వద్దులే, అమ్మా... బాక్ సీటు నాకు పడదు" అంటూ

## మౌక్తిక పద్యము

సముద్రం ఒకడి కాళ్ళ దగ్గర కూర్చుని మొరగదు
తుఫాను గొంతు చిత్తం అనడం ఎరగదు
పర్వతం ఎవడికీ వంగి సలాం చెయ్యదు
నేనింతా ఒక పిడికెడు మట్టే కావచ్చు
కానీ కలమెత్తితే నాకు
ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది.

కష్టాల్ని కన్నీటిలో ముంచుకుని
బిస్కెట్లలా తింటాను
బ్రతుక్కంటే బలవంతుడైనవాడే
శబ్దం నుంచి శతాబ్దం వరకూ
మలిచేశిల్పి అని ఆవిష్కరిస్తాను

\- శేషేంద్ర

గింజుకుంది ఆదెమ్మ.

ఎంత మెతక ముసలివాడైనా భర్త పక్కన పరాయి స్త్రీకి చోటు ఇవ్వడానికి అంగీకరించలేదు ఆవిడ. బస్సు సూర్యాపేటలో ఆగింది. ఆదిదంపతులు దిగారు. కాసేపు మాటల కోలాటం అనంతరం ఒక ఏకగ్రీవ నిర్ణయానికి వచ్చారు. రాజీకి వచ్చారు.

సాంబు రూమ్‌కి వెళ్ళాక కొడుక్కి ఏకాంతంగా లెక్చర్ ఇవ్వడానికి, తమ వాదన వినిపించడానికి చెరో అర గంట కేటాయించుకున్నారు. అతను ఏ పిల్ల కేసి మొగ్గితే ఆ పిల్లతో కళ్యాణం జరిపించాలనుకున్నారు. ఆ పిల్ల మోహిని అయితే మాత్రం సాంబు చెవి మెలేసి తమ ఊరు తీసుకెళ్ళి అయిన కాడికి అమ్మేసి పెళ్ళి చేయాలనుకున్నారు.

పై నిర్ణయాలతో వాళ్ళిద్దరి మనసులు తేలికపడి కేరింతలు కొట్టింది. హారన్ మోగగానే బస్సెక్కారు. పరాచికాలు ఆడుకుంటూ ఒకర్ని ఒరుసుకుని ఒకరు కూర్చున్నారు.

"కలికాలం, తల్లీ, కలికాలం. ఇంతవరకు చిటపటలాడిన ముసలాళ్ళు ఇట్టే ప్రేమించుకుంటున్నారు. ఈ వయసులో ఇవేం పాడు బుద్ధులో" అంటూ బుగ్గలు నొక్కుకున్నారు కొందరు.

×× ×× ××

కష్టమనేది తెలీకుండా సాంబు రూమ్‌కి చేరుకున్నారు ఆదిదంపతులు. సాంబు రూమ్‌లో గర్భిణీ స్త్రీని చూసి, "ఎవరమ్మా నువ్వు" అంటూ దాష్టికంగానే అడిగింది ఆదెమ్మ.

"ఇది సాంబశివరావు రూమేనా?" అనుమానంగా అడిగాడు ఆదిమూర్తి.

"అవునండి. వారిప్పుడే బయటికి వెళ్ళారు. మీరెవరు" అంటూ ప్రశ్నించిందా గర్భిణీ యువతి.

"నువ్వెవరో చెప్పి ఏడ్చావుకాదు." నోరు పారేసుకుంది ఆదెమ్మ.

"నేను వారి శ్రీమతిని. నా కడుపులో ఉంది వారి బిడ్డ. ఇక చాలా? ఇంతకీ మీరెవరో సెలవిచ్చారు కాదు."

"మేం సాంబశివరావుని కన్నవాళ్ళం." ఏడ్చినంత పని చేశాడు ఆదిమూర్తి.

"అలానా! రండి. కూర్చోండి. మీ గురించి చాలా ఘోరంగా వర్ణించాడు మీ అబ్బాయి. నేనెంత మారాం చేసినా మా పెళ్ళికి మిమ్మల్ని ఆహ్వానించలేదు మీ అబ్బాయి. 'మా అమ్మ రాక్షసి. మా నాన్న ఆ రాక్షసికి సేవకుడు. నిన్ను కిరసనాయిల్ హత్య చేస్తారని నన్ను బెదరకొట్టాడు మీ అబ్బాయి. మిమ్మల్ని చూస్తుంటే మీ అబ్బాయి వర్ణించినంత దారుణంగా లేరు" అంటూ ఆ యువతి అమాయకంగా మాట్లాడసాగింది.

"నోర్ముయ్యవే, బజారుముండా. ఇలాగే నంగి నంగి వేషాలు వేసి మావాడిని కొంగున ముడి వేసుకున్నావు" అంటూ భర్త వారించినా వినకుండా నోటికి వచ్చినట్లు వాగసాగింది ఆదెమ్మ.

"షటప్! ఓల్డ్ ఫెలో! పెద్దదానివని, అందులో అత్తవని కిరీటం పెడితే రంకు కూతలు కూస్తావా" అంటూ కాళికలా విరుచుకుపడిందా యువతి.

అంతలో అప్పుడే వచ్చిన సాంబశివరావు, "ఏమిటే అల్లరీ? ఎవరీ ముసలాళ్ళు" అంటూ భార్యని ప్రశ్నించాడు.

ఆదెమ్మ ముఖం వెలిసింది. తల బాదుకున్నాడు ఆదిమూర్తి.

"మీ అమ్మా, నాన్నా." చూడముచ్చటగా కసిరిందా యువతి.

"వీళ్ళు నా తల్లితండ్రులు కారు. పగటి దొంగలు. ఏవో వావి వరసలు కలిపి చేతికి చిక్కినంత దోచుకుపోతారు."

సాంబశివరావు ధోరణికి అడ్డు వస్తూ, "బాబూ, నువ్వు మా అబ్బాయివి కాదు. ఈ పిల్ల మా కోడలు కాదు. మా సాంబు ఈ రూమ్ ఎడ్రెస్ ఇచ్చాడు" అంటూ గుండెని పిండి విలపించాడు ఆదిమూర్తి. 'తందానా' అంటూ ముక్కు చీదింది ఆదెమ్మ.

"నేను అసలు కథ చెప్తాను". అంటూ ఇంటి ఓనర్ రంగంలోకి ప్రవేశించి గళం విప్పాడు.

"గతంలో సాంబు ఈ గదిలోనే ఉండేవాడు. మీరు రాసే ఉత్తరాలకి భయపడి, మీ తోబుట్టువుల బెదిరింపులకి కంగారు పడి, ఎవర్ని పెళ్ళాడినా తనకి సుఖపడే రాత లేదని చివరికి తెలివైన తెగింపుకి వచ్చేశాడు."

"ఎంతైనా మాది తెలివైన వంశం." ఛాతీ పెంచాడు ఆదిమూర్తి.

"వాడు నా కొడుకు. అంతా నా పెంపకం మహిమ." కళ్ళెగరేసింది ఆదెమ్మ.

"సాంబు మా అమ్మాయి మోహినిని ప్రేమించాడు" అన్నాడు ఇంటి ఓనర్.

"మా అబ్బాయిని బేవర్స్‌గా అల్లుడిగా చేసుకోవాలని మీ అమ్మాయిని ఉసికొల్పుతావా, డాఫర్ వెధవా. నీ కొడుకుని బిచ్చగత్తె ప్రేమించా. నీ ఇల్లు కూలా!" ఆదెమ్మ శాపాలకి అడ్డు వస్తూ గాండ్రించాడు ఇంటి ఓనర్.

"మీ రిలా మొరుగుతారని, మీ నోటిని సాంబు మూయలేడని అతని ప్రేమని తిరస్కరించింది మా అమ్మాయి."

"ఇంతకీ మా వాడు ఎక్కడ?" గద్దించాడు ఆదిమూర్తి.

"తెలివిగా సన్యాసుల్లో కలిశాడు."

'పెళ్ళి కాకుండా సన్యాసుల్లో ఎలా కలిశావురా' అంటూ రాగం అందుకుంది ఆదెమ్మ.

"మంచి పనే చేశాడు. పెళ్ళైతే నాలా ఇలా మునుగుతూ, తేలుతూ పడి ఉండాలి" అంటూ చీదరించుకున్నాడు ఆదిమూర్తి.